

మార్కెట్ రోడ్‌లో తవ్విన కాలువను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# వ్యాపారులపై కక్షతోనే కూల్చివేతలు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మార్కెట్‌రోడ్‌లో పర్యటన

మంచిర్యాలటౌన్, నవంబర్ 14 : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదన్న కారణంతోనే వ్యాపారులపై కక్షగట్టి మార్కెట్‌రోడ్‌లోని భవనాలను ఇష్టారాజ్యంగా కూల్చివేస్తున్నారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్‌రోడ్‌లో ఆయన పర్యటించారు. వ్యాపారులకు సంబంధించిన కూల్చివేతలను, ఇష్టారీతిన తవ్విన కందకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచిర్యాలలో వ్యాపారులు, ప్రజలు భయంతో జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. ఎలాంటి టెండర్లు లేకుండానే అర్చన టెక్స్ చౌరస్తా నుంచి కిందకు రోడ్డు వెడల్పు పేరుతో భవనాలను కూల్చేశారని, కాలువ నిర్మాణం కోసం కందకం తవ్వారని తెలిపారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతోనే అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామని, కానీ కక్షపూరితంగా చేస్తున్న పనులను ఏమాత్రం సహించబోమని అన్నారు. వ్యాపారులు, ప్రజలకు బీఆర్‌ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంచిర్యాలలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు ఎడ్ల శంకర్, పడాల రవీందర్, శ్రీనివాస్, కర్రు శంకర్, రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కాక



- తమ కుటుంబానికే మినిస్టర్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చారన్న ఎమ్మెల్యే వివేక్
- పీఎస్సార్‌కు 'విద్యాశాఖ' అంటూ ఆయన వర్గం ధీమా
- ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జుకే వస్తుందంటూ ఆదివాసీల ఆశలు

## మంత్రి పదవిపై ఉమ్మడి జిల్లా హస్తం పార్టీలో పోటాపోటీ

మంచిర్యాల, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవి 'కాక' రేపుతున్నది. మొన్నటికి మొన్న కాంగ్రెస్ అధిష్టానం అనూహ్యంగా వెడ్మ బొజ్జు పేరును పరిశీలిస్తున్న విషయం బయటికి వచ్చింది. దీంతో తూర్పు జిల్లాగా పేరొందిన మంచిర్యాల ప్రాంతానికి చెందిన నాయకులకు కాకుండా, ఈసారి కూడా పశ్చిమ జిల్లా వాసులకే మంత్రి పదవి ఇస్తారనే చర్చ సాగింది. ఈ సర్కారు హయాంలో మా లీడర్‌కు మంత్రి పదవి వస్తుందంటూ ఆదివాసీలు గంపెడాశలు పెట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేల్లో ఒకరికి ఆర్టీసీ చైర్మన్, మరొకరికి ప్రభుత్వ విప్ పదవులు ఇస్తారంటూ కాంగ్రెస్ లీడర్లే చెప్పుకున్నారు. ఇదిలా ఉంటే చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మంత్రి పదవిపై బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మాల సంఘం అధ్యక్షుడు చేపట్టిన పాదయాత్ర మంచిర్యాల జిల్లా ఇందారం చేరుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ''ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాక కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు'' అంటూ చెప్పుకొచ్చారు. దీంతో మంత్రి పదవి విషయంలో ఆయన ఇంకా పట్టు విడవలేదని స్పష్టమైంది. మా సార్‌కే మంత్రి పదవి అంటూ చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు తెగ ప్రచారం చేస్తున్నారు. దీంతో మంత్రిపదవి అంశం ఉమ్మడి జిల్లాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

### రెండు నియోజకవర్గాల్లో వర్గపోరు


మరోవైపు మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ సన్నిహితులు సైతం మా సార్‌కు మంత్రి పదవి ఇస్తారని చెప్పుకొస్తున్నారు. డిసెంబర్‌లో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని.. మా సార్ మంత్రి అవుతారని, అది కూడా విద్యాశాఖ మంత్రి అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ లీడర్లు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తున్నది. ఒకటి పీఎస్సార్ వర్గం, మరొకటి కాక కుటుంబ వర్గంగా ఏర్పడ్డాయనే చర్చ జోరందుకున్నది. చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ అంటే గిట్టని నాయకులు పీఎస్సార్ గూటికి చేరుతున్నారు. మొన్నటికి మొన్న ఓ కేసు విషయపై చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు కొందరు పీఎస్సార్‌తో టచ్‌లోకి వెళ్లారనే గుసగుసలు వినిపించాయి. అంతకు ముందే మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ విషయాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. చెన్నూర్‌లో ఉప ముఖ్యమంత్రి టూర్ రద్దు అయిన రోజు సాయంత్రమే వివేక్ చెన్నూర్‌లో అత్యంత సన్నిహితమైన నాయకులతో సమావేశమయ్యారు. జిల్లాలో మనం పట్టు సాధించాలంటూ చెప్పుకొచ్చారు. దీంతో ఈ ఇద్దరు నాయకుల మధ్య దూరం మరింత పెరిగిందనే వాదనలకు బలం చేకూరింది. మంచిర్యాలలో ఉండి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కొందరు కీలక నాయకులు పీఎస్సార్ దగ్గరకు వెళ్లలేక వివేక్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. వారంతాల్లో వివేక్ మంచిర్యాలకు వచ్చిన ప్రతిసారి ఆ నాయకులు ఆయన్ని కలవడానికి ఇంటికి వస్తున్నారు. ఇద్దరు నేతల మధ్య అంతర్గతంగా పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం పెరిగిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఎవరికి మంత్రి పదవి వచ్చినా మనకు మంచి జరగాలంటే ప్రస్తుతానికి అంటీ ముట్టనట్లు ఉండడమే మంచిదనే ఆలోచనలో ఉన్నారు.

### చీమ చిటుక్కుమన్నా ఇంటెలీజెన్స్ ఆరా..!

మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురికి ముగ్గురు మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో చీమ చిటుక్కుమన్నా ఇంటెలీజెన్స్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. ఎమ్మెల్యేలు చేసే ప్రతి పనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీన్నే సీఎంతో సాన్నిహిత్యంగా ఉండే ఓ ఎమ్మెల్యే బ్రహ్మాస్త్రంగా వాడుకుంటున్నట్లు తెలిసింది. మంచిర్యాలలో ఇటీవల జరిగిన కూల్చివేతలకు ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంపైనా, శాంతి భద్రతలకు కలుగుతున్న విఘాతంపైనా సదరు ఎమ్మెల్యే అధిష్టానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదే సమయంలో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పార్టీలో జరుగుతున్న గొడవలు, చిన్నచిన్న విషయాల్లో అనధికార జోక్యంపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. గడిచిన ఏడాది కాలంలో ఎమ్మెల్యేలు చేసిన పనుల్లోని లోపాలను ఎత్తి చూపి మంత్రి పదవికి దాన్ని లింక్ చేస్తారనే చర్చ జిల్లాలో నడుస్తున్నది. వాటి ఆధారంగా మంచిర్యాల జిల్లాలోని ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి ప్రభుత్వం ఆదీవాసీ నినాదం ఎత్తుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే మంచిర్యాల ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై పెట్టుకున్న ఆశలు గల్లంతు అవ్వడం ఖాయంగా కనిపిస్తున్నది.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

- రైతులకు బీఆర్‌ఎస్ భరోసాగా ఉంటుంది
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- పరిగి సబ్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, రైతులకు పరామర్శ



నేలపై కూర్చొని రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని, రాష్ట్రంలోని రైతులకు బీఆర్‌ఎస్ భరోసాగా ఉంటుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిగి సబ్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, రైతులను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ ఓటు వేసి గెలిపిస్తే తమ బతుకులు మారుతాయని ఆశపడ్డ రైతుల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొడుతున్నదని మండిపడ్డారు. అక్రమంగా అరెస్టైన పేద రైతులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటారన్నారు. పోలీసులు సీఎం రేవంత్ రెడ్డి సైన్యంలా పని చేస్తున్నారని, ఓ ఇంట్లోకి చొరబడి మహిళ ఛాతీపై కాలితో తొక్కి ఆమె భర్తను అరెస్టు చేశారని, ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన రైతులను తీవ్రంగా కొట్టారని, ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్టీ కమిషన్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత మొదలైందని, సీఎం సొంత నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేదన్నారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 14 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖ భవనంలో ఏర్పాటు చేసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# తిర్యాణి అడవుల్లోకి ఎస్-12

తోడు కోసం తిరుగుతున్న పెద్దపులి



సీసీ కెమెరాల్లో రికార్డు అయిన పెద్దపులి

మంచిర్యాల, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌రేంజ్ అడవుల్లో నెలన్నరగా సంచరిస్తున్న పెద్దపులి(ఎస్-12) కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అడవుల్లోకి వెళ్లిపోయింది. హాజీపూర్, కాసిపేట మండలాల్లోని అటవీ ప్రాంతంలో మకాం వేసిన పులి పాడిపశువులపై దాడులు చేసింది. అటవీ శాఖ అధికారులు అటు పెద్దపులికి, ఇటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాలతో పులిని నిత్యం ట్రాక్ చేస్తూ.. పులి సంచారం ఎక్కడ ఉంటే ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వచ్చారు. పులి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం లక్షెట్టిపేట రేంజ్ దాటుకొని బెల్లంపల్లి రేంజ్ ముత్యంపల్లి, దేవాపూర్ మీదుగా తిర్యాణి అడవుల్లోకి పెద్దపులి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ పులి ఆడ తోడు కోసం తిరుగుతుందని, అందులో భాగంగానే తిర్యాణి అడవుల్లోకి వెళ్లిందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

### పెద్ద పులి పాదముద్రల గుర్తింపు

కాసిపేట, నవంబర్ 14 : కాసిపేట మండలం దేవాపూర్, ధర్మారావుపేట, వెంకటాపూర్ అటవీప్రాంతం నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల పరిధిలోని ఎగ్గండి-ఏదులపాడ్ ప్రాంతంలోకి చేరుకున్న పెద్ద పులి పాద ముద్రలను గురువారం అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అటవీ ప్రాంత పల్లెల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లోకి వెళ్లవద్దని ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



ఏదులపాడ్‌లో లభ్యమైన పెద్దపులి పాదముద్రలు

# చదువుతోనే అభివృద్ధి సాధ్యం

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- రొట్టెపల్లిలో కుమ్రం భీం వర్ధంతి



మాట్లాడుతున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, నవంబర్ 14 : చదువుతోనే అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం రొట్టెపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన కుమ్రం భీం వర్ధంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయాల నడుమ పూజలు చేసి.. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీం జల్, జంగిల్, జమీన్... నినాదంతో నైజాం ప్రభుత్వంతో పోరాటం చేశారని, ఆయన త్యాగం ఫలితంగానే నేడు అడవిబిడ్డలు స్వేచ్ఛగా బతుకుతున్నారని కొనియాడారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధనకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, కొమ్ముల బాపు, ఆత్రం జంగు, మడావి వెంకటేశ్, చిక్రం భీం, రామకృష్ణ, గణపతి, రాందాస్, నాయకులు రాంటెంకి వాస్‌దేవ్, లంక లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# గూడెం గుట్టకు కార్తీక శోభ



గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయం

- జాతరకు ముస్తాబైన సత్యనారాయణ స్వామి ఆలయం
- నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

దండేపల్లి, నవంబర్14 : నేడు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గూడెంలోని ఆలయాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. సత్యనారాయణస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతర సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. లడ్డూలు, పులిహోరా ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. భక్తులు సేదదీరేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. గురువారం జాతర ఏర్పాట్ల గురించి లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

### జనసంద్రం కానున్న గోదావరి తీరం..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సుమారు 50 వేల నుంచి 70 వేల మంది భక్తులు తరలిరానుండగా, గూడెం గోదావరి తీరం జనసంద్రంగా మారనున్నది. సత్యనారాయణ స్వామి ఆలయానికి సమీపంలో గోదావరినది ప్రవహిస్తుండడంతో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకోనున్నారు. దీపారాధనలు, తులసీ పూజలు చేయనున్నారు. గోదావరిలో లోతైన ప్రదేశాలకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు నిర్మించారు.

### వైభవంగా వ్రతాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. గురువారం గోదావరి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం గుట్టపై ఉన్న స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నోముకున్నారు. ఆలయ ఆ వరణలో ఉన్న రావిచెట్టు వద్ద, గుట్టపైభాగంలో ఉన్న ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిత్యహవనము, బలిహరణము, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

# బాలల హక్కులను కాపాడుదాం



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నస్పూర్ : పిల్లలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 14 : బాలల హక్కులను సమష్టిగా కాపాడుదామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మాజీ దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లా మహిళా, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ వేడుకలకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్, ఆసిఫాబాద్ సీడీపీవో సాదియా రుక్సానా, బాల రక్షక్ భవన్, సఖీ సిబ్బంది, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### సన్మార్గంలో నడిపించాలి

నస్పూర్, నవంబరు 14 : బాల బలికలను సన్మార్గంలో నడిపించి.. వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. మహిళా శిశు సంక్షేమాధికారి స్వరూపరాణితో కలిసి కేక్ కట్ చేశారు. పిల్లలకు బహుమతులు అందించారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆనంద్, పర్యవేక్షకులు ఇందిర పాల్గొన్నారు.